ఎక్కడి చెత్త అక్కడే



రేణిగుంట పాంచాలినగర్‌లో రోడ్డుపై ఉన్న వ్యర్థాలు





ఓల్డ్ చెక్ పోస్ట్ పాత విమానాశ్రయ రోడ్డులో పేరుకుపోయిన చెత్త



రైల్వే క్వార్టర్స్ సమీపంలో వున్న చెత్త

రేణిగుంట: మేజర్ పంచాయతీ అయిన రేణిగుంట పట్టణంలో ఎక్కడ చూసినా చెత్త దర్శనమిస్తోంది. మేజర్ పంచాయతీలో 20 వార్డులు ఉన్నాయి. 90 మంది పారిశుద్ధ్య కార్మికులు, ఒక మేస్త్రీ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, ఈవో ఉన్నారు. వీరు పట్టణంలోని ప్రధాన వీధుల్లో మాత్రమే చెత్తను శుభ్రం చేస్తున్నారు. కాలనీలపై దృష్టిసారించడం లేదు. దీంతో ఎక్కడ చూసినా చెత్త దర్శనమిస్తోంది. ముఖ్యంగా పాంచాలినగర్, ఓల్డ్ చెక్‌పోస్టు, పాత విమానాశ్రయం రోడ్డు తదితర ప్రాంతాల్లో చెత్త పేరుకుపోయింది. ఒక పక్క వైద్యాధికారులు మలేరియా వ్యాపించకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పంచాయతీ అధికారులు మాత్రం పారిశుద్ధ్య పనులు చేపట్టడంలో విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షాలు పడుతున్న తరుణంలో వీధుల్లో చెత్త పేరుకుపోవడం వల్ల దోమలు వృద్ధి చెంది జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

మృతుని కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం అమ్మపాళెంకు చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి మాజీ సభ్యుడు, మాజీ సర్పంచ్ కందాటి వెంకట రాఘవరెడ్డి ఇటీవల మరణించారు. ఆయన కర్మక్రియలను శనివారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అక్కడికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బత్తి సుదర్శన్‌రెడ్డి, చంద్రారెడ్డి, సురేష్‌రెడ్డి, మున్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చుక్కలనిడిగల్లులో..



మురళీకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం చుక్కలనిడిగల్లు గ్రామానికి చెందిన పెరిమిడి బాలాజీ కుమారుడు పెరిమిడి మురళీకృష్ణ రెండు రోజుల క్రితం ప్రమాదవశాత్తు తెలుగు గంగ కాలువలో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు చుక్కలనిడిగల్లుకు చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో సాధన మున్నా రాయల్, శరవణకుమార్, మస్తాన్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ దొరస్వామి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పుత్తేరి గ్రామంలో శనివారం జరిగిన ఉచిత కంటి పరీక్షల వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని సర్పంచ్ రామ్మూర్తి తెలిపారు. శ్రీకాళహస్తిలోని శుక బ్రహ్మాశ్రమం, భక్త కన్నప్ప కంటి ఆసుపత్రి ద్వారా కంటి పరీక్షలను వైద్యుడు దొరస్వామి 120 మంది రోగులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

నిత్యాన్నదానానికి విరాళం



విరాళం అందిస్తున్న దాతలు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో ప్రసిద్ధ ప్రదోషక్షేత్రంగా భాసిల్లుతున్న శ్రీసర్వమంగళ సమేత శ్రీపల్లికొండేశ్వర స్వామి దేవస్థానంలో ప్రతి రోజూ జరిగే నిత్యాన్నదానానికి శ్రీకాళహస్తికి చెందిన సుధాకర్‌రెడ్డి రాజేశ్వరి దంపతులు శనివారం ఆలయ కార్యనిర్వహణాధికారి లతకు రూ.లక్ష విరాళంగా అందించారు. వారికి ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేసి ఆలయ మర్యాదలతో సత్కరించి, వారికి స్వామివారి చిత్ర పటాన్ని బహూకరించి, తీర్థ ప్రసాదాలను అందించారు.

శాస్త్రోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

గంగ నీరు సరఫరా చేయాలి



తెలుగుగంగ చీఫ్ ఇంజినీర్ ఎంఎల్ఎస్ వరప్రసాద్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: అవసరం ఉన్న ప్రాంతాల్లో చెరువులకు, పొలాల కోసం ఉపకాలువలు ఏర్పాటు చేసి రైతులకు సాగు నీరు అందించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలుగు గంగ చీఫ్ ఇంజినీర్ ఎంఎల్ఎస్ వరప్రసాద్‌ను కోరారు. శనివారం తెలుగు గంగ చీఫ్ ఇంజినీర్, తమిళనాడు గంగ ఈఈ మహేంద్రన్, ఎమ్మెల్యే కలసి ఆంధ్ర–తమిళనాడు సరిహద్దుల్లోని జీరో పాయింట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గంగ కాలువ ఏర్పాటు చేసి 30 ఏళ్లు పైబడుతున్నా సత్యవేడు ప్రాంతంలో గంగ నీరు సమగ్రంగా రైతాంగానికి అందడం లేదన్నారు. సప్లై చానళ్లు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. కాలువలో పూడిక తీత పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో గంగ అధికారులు వీకేఎస్ పరమశివం, లోకయ్యరెడ్డి, మురళీ(చికెన్ చిన్నా), బాలమురళీకృష్ణ, మునికృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు

ఘనంగా రేణుకా ఎల్లమ్మ కొలుపు



అమ్మవారిని దర్శించుకుంటున్న సామాను అనసూయమ్మ

ఏర్పేడు: మండలంలోని కొత్తవీరాపురం అరుంధతివాడ గ్రామ దేవత శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కొలుపు ఉత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలో వేసిన అమ్మవారి ముగ్గు ఆకట్టుకుంది. ఉత్సవాల సందర్భంగా శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అత్త సామాను అనసూయమ్మ అమ్మవారికి సారె సమర్పించారు. ఆమెను ఆలయ పెద్దలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏర్పేడు మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కిషోర్ రెడ్డి, ఏర్పేడు మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్య యాదవ్, వైస్ ఎంపీపీ జమళ్ల శ్రీనివాసులుయాదవ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు మునికృష్ణ రెడ్డి, వర్మ, శంకర్ రెడ్డి, మునిరత్నం రెడ్డి, కమల్, ప్రభు, చిన్న, సురేఖ, అయ్యప్ప, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గోమాతకు అంత్యక్రియలు



ఏర్పేడు మండలం వికృతమాలలో గోమాతకు అంత్యక్రియలు చేస్తున్న దృశ్యం

ఏర్పేడు: మండలంలోని వికృతమాలలో శనివారం గోమాతకు అంత్యక్రియలు నిర్వహించారు. భారతీయ హిందూ సంప్రదాయంలో గోవుకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ క్రమంలో 20 ఏళ్లుగా తమ కుటుంబంతో పెనవేసుకున్న బంధం వల్ల గోమాతకు శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు కృతమాలకు చెందిన శేఖర్‌యాదవ్ కుటుంబ సభ్యులు. శేఖర్‌యాదవ్‌కు 20 సంవత్సరాల వయస్సు కలిగిన ఆవు ఉంది. దాన్ని ఎంతో మురిపెంగా పోషించుకుంటున్నారు. అది 18 ఈతల్లో 9 పెయ్య, 9 కోడె దూడలకు జన్మనిచ్చింది. ఈ నేపథ్యంలో శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో శేఖర్ యాదవ్ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. తమ కుటుంబంతో ఎంతో పెనవేసుకున్న గోమాతకు పూజలు నిర్వహించి అంత్యక్రియలు చేపట్టారు. మైల తీరేందుకు పాలు కూడా పోశారు.

ఆర్టీసీ బస్సులో రూ.లక్ష నగదు చోరీ

నాగలాపురం: ఆర్టీసీ బస్సులో రూ.లక్ష నగదు చోరీ చేసిన ఘటన మండలంలోని స్థానిక బస్టాండ్ వద్ద శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధిత మహిళ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కడివేడు గ్రామానికి చెందిన సుకన్య(32) తన తల్లితో కలిసి తిరుపతిలో చదువుతున్న తన పిల్లలకు స్కూల్ ఫీజు కట్టడానికి తన స్వగ్రామమైన కడివేడు నుంచి బస్సులో నాగలాపురం ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకుంది. అక్కడ నుంచి స్థానిక ఆర్టీసి బస్టాండ్ వద్ద తిరుపతి వెళ్లడానికి సత్యవేడు డిపోకు చెందిన సత్యవేడు–తిరుపతి బస్సు ఎక్కారు. బస్సు ఎక్కిన తర్వాత తాను తగిలించుకుని ఉన్న బ్యాగు జిప్ తెరిచి ఉండడం గమనించి చూడగా తన బ్యాగులో తన పిల్లల ఫీజు కట్టడానికి ఉన్న రూ.లక్ష హ్యాండ్ బ్యాగుతో సహా పోగొట్టుకున్న విషయం గమనించి, వెంటనే బస్సు దిగేసింది. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ సునీల్ బస్టాండ్‌కు చేరుకుని, విచారణ మొదలుపెట్టారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్ఐ సునీల్ తెలిపారు.

వేధిస్తున్న యూరియా కొరత

వరదయ్యపాళెం: మండలంలో రైతులను యూరియా కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు మండలంలోని సీఎల్ఎన్‌పల్లి, మరదవాడ, కళత్తూరు, అంబూరు, పెద్ద పాండూరు, మత్తేరిమిట్ట, మరికొన్ని ప్రాంతాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. అయితే వారికి యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేటు డీలర్ల వద్ద యూరియా లేకపోవడంతో తమిళనాడు ప్రాంతాలకు వెళ్లి అధిక ధరలకు యూరియా కొనుగోలు చేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ ఎదురవ్వలేదని రైతులు చెబుతున్నారు. అయితే వ్యవసాయ శాఖ ద్వారా ఇటీవల రెండు లోడ్లు వచ్చినప్పటికీ అది కొంత మంది రైతులు పోటీ పడి తీసుకువెళ్లారు. ఇంకా అవసరం ఉండడంతో వ్యవసాయ కార్యాలయం చుట్టూ రైతులు తిరుగుతూనే ఉన్నా ఫలితం లేదు. మండల ఏఓను యూరియా కొరత గురించి వివరణ కోరగా సరఫరా కోసం ప్రభుత్వానికి నివేదించామని, అందులో భాగంగా ఇటీవల రెండు లోడ్లు రావడంతో రైతులకు అందజేశామన్నారు. మరలా రప్పించేందుకు అధికారులతో మాట్లాడుతున్నామని తెలిపారు.

మడుగులు కాదు.. రోడ్లే!



పాండూరు–వరదయ్యపాళెం రోడ్డులో త్రయంబకేశ్వరాలయం వద్ద నిలిచిన రోడ్డు

వరదయ్యపాళెం: మండలంలోని పెద్ద పాండూరు–వరదయ్యపాళెం ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డు మడుగులను తలపిస్తోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెరువులను తలపించేలా వర్షపునీరు నిలుస్తోంది. ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న చిన్నపాటి వర్షాలకు వరదయ్యపాళెం హైస్కూల్, త్రయంబకేశ్వరాలయం, చెన్నవారిపాళెం, పెద్ద పాండూరు వద్ద రోడ్డు అధ్వానంగా ఉందని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో నీటి గుంతల్లో దిగి ప్రమాదాలకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తవుతున్నా రోడ్ల దుస్థితి పాలకులకు కనిపించలేదా అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ప్రభుత్వ శాఖాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

నాగలాపురం: మండలంలోని జానికాపురం గ్రామంలో శ్రీఅంకాలమ్మ కొలుపు పురస్కరించుకుని ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత కంటి, దంత వైద్య శిబిరాన్ని నాగలాపురం డాక్టర్ రామచంద్ర చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. డాక్టర్ ముత్యాల చిన్ని కృష్ణుడు మెమోరియల్ ట్రస్ట్ తిరుపతి వారి నేతృత్వంలో ఉచిత కంటి, దంత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. పరిసర ప్రాంత ప్రజలు ఈ శిబిరంలో పాల్గొని, ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామ పెద్దలు కోరారు.

ఎండీపుత్తూరులో..



సర్పంచ్ మోహనప్రియ

ఏర్పేడు: మండలంలోని ఎండీ పుత్తూరు గ్రామంలో ఆదివారం నారాయణాద్రి హాస్పిటల్ వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ మోహనప్రియ తెలిపారు. బీపీ, షుగర్, ఈసీజీ తదితర అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ శిబిరాన్ని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏర్పేడు పశు వైద్యాధికారిణిగా మోహన కుమారి



ఏర్పేడు : మండల కేంద్రమైన ఏర్పేడు పశు వైద్యాధికారిణిగా డాక్టర్ జి.మోహన కుమారి శనివారం విధుల్లో చేరారు. ఆమె పాకాల మండలం కే.వడ్డేపల్లి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పాడి రైతుల సంక్షేమం కోసం అందిస్తున్న పథకాలను వానికి సక్రమంగా అందే విధంగా కృషి చేస్తానని తెలిపారు.

విద్యుత్ బస్సులు ఓ వరం

తిరుపతి అర్బన్ : జిల్లాకు వంద విద్యుత్ బస్సులు కేటాయించడం ఓ వరమని డీపీటీఓ వెంకట్రావ్ తెలిపారు. శనివారం ఏడుకొండల బస్టాండ్ సమీపంలోని విద్యుత్ బస్సుల చార్జింగ్ పాయింట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చార్జింగ్ పాయింట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. తిరుమలకు 50, రేణిగుంట ఎయిర్‌పోర్ట్‌కు 14, కడపకు 12, మదనపల్లెకు 12, నెల్లూరుకు 12 విద్యుత్ సర్వీసులు క్రమం తప్పకుండా నడపాలని ఆదేశించారు. బస్టాండ్ ఆవరణలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని చెప్పారు. కంట్రోలర్స్ నిత్యం అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఏటీఎం డీఆర్ నాయుడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ దుర్మరణం



కల్వర్టును ఢీకొన్న కారు



మృతి చెందిన కాసారపు రాజు

రేణిగుంట : రేణిగుంట వైపు నుంచి శ్రీకాళహస్తి వైపు వెళ్తున్న కారు మల్లవరం బ్రిడ్జి వద్ద కల్వర్టును ఢీకొనడంతో కారు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... రేణిగుంట మండలంలోని పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారి మల్లవరం బ్రిడ్జి పైన శనివారం శ్రీకాళహస్తి వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి కల్వర్టును ఢీకొనడంతో ఈస్ట్ గోదావరి జిల్లాకు చెందిన కారు డ్రైవర్ కాసారపు రాజు (52) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కారులో వెనకాల కూర్చున్న వ్యక్తికి గాయాలు కాగా అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రేణిగుంట అర్బన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యోగాపై అవగాహన



బీఎన్‌కండ్రిగలో యోగాసనాలు వేస్తున్న తహసీల్దారు, ఎంపీడీవో, ఎంఈవో

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలోని సమావేశ హాల్‌లో శనివారం యోగాసనాలపై యోగా గురువు సురేష్‌నాయుడు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దారు శ్రీదేవి మాట్లాడుతూ యోగా మనిషి జీవితంలో భాగం కావాలని, సంపూర్ణ ఆరోగ్యం యోగాతోనే సాధ్యమని తెలిపారు. యోగా సాధనతో మానసిక సమస్యలు, శారీరక రుగ్మతల నుంచి విముక్తి లభిస్తుందన్నారు. ఎంపీడీఓ వెంకటరత్నమ్మ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో యోగా కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, వైద్యాధికారి మురళీరెడ్డి, సుధాకర్‌నాయుడు, ప్రధానోపాధ్యాయులు రమణయ్య, సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, గ్రామ కార్యదర్శి సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాజ సేవలో ముందుండాలి



రక్తదానం చేసిన వారిని అభినందిస్తున్న చంద్రప్ప, వైద్యులు తదితరులు

శ్రీకాళహస్తి: సమాజ సేవలో ప్రతి ఒక్కరూ ముందుండాలని బీజేపీ తిరుపతి జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రప్ప అన్నారు. శనివారం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శనివారం ప్రపంచ బ్లడ్ డొనేషన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 26 మంది రక్తదానం చేశారు. ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన మరొకరి ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. రక్తదానం చేయడం వలన కొత్త రక్తం చేరి మనిషి మరింత ఆరోగ్యంగా ఉంటాడని తెలిపారు. స్ట్రెంత్ జిమ్ క్లబ్ నిర్వాహకులు జయదేవ్, సందీప్ ఆధ్వర్యంలో తరుణ్, జస్వంత్, చరణ్, సాయి, ఏఐఎస్ఎఫ్ నాయకులు కోగిలి మునిచందు తదితరులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైద్యులు మురళీకృష్ణ, మధు, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల కిటకిట



ఆలయం వద్ద ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం భక్తులతో శనివారం కిటకిటలాడింది. వరుస సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 30 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500, రూ.750, రూ.1,500, రూ.2,500, రూ.5 వేలు రాహుకేతు పూజలు మొత్తం 5,949 పూజలు జరిగాయి. ఇక రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 4,951 మంది, రూ.50 ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,903 మంది, రూ.500 అంతరాలయ దర్శనం టిక్కెట్ల ద్వారా 832 భక్తులు దర్శించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 24,768 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

పరశురామేశ్వరుని సేవలో రాష్ట్ర ఎండోమెంట్ కమిషనర్



ఏర్పేడు గుడిమల్లం ఆలయం వద్ద రాష్ట్ర ఎండోమెంట్ కమిషనర్ రామచంద్రమోహన్

ఏర్పేడు: రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ రామచంద్రామోహన్ శనివారం గుడిమల్లంలో వెలసిన శ్రీఆనందవల్లీ సమేత పరశురామేశ్వర స్వామిని దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చిన ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. కార్యక్రమంలో జిల్లా దేవాదాయ శాఖ అధికారి పి.రామకృష్ణారెడ్డి, తిరుపతి తనిఖీ అధికారి పణిరాజ, ఆలయ ప్రధాన అర్చకులు వంశీకృష్ణ శర్మ, ఆలయ అర్చకులు యోగేంద్ర పవన్ కుమార్ శర్మ పాల్గొన్నారు.